## 84- సమాధిలో మృతునికి ఏమి జరుగుతుంది?

**మృతుడు తన బంధువులు తిరిగి వెళ్తుండగా వారి పాదాల శబ్దాన్ని సమాధిలో వింటాడు.**

عن أنس ﷺ عن النبي ﷺ قال: ((العبد إذا وضع في قبره وتولى وذهب أصحابه . حتى إنه ليسمع قرع نعالهم . أتاه ملكان فأقعداه فيقولان له: ما كنت تقول في هذا الرجل محمد ﷺ؟ فيقول: أشهد أنه عبد الله ورسوله. فيقال له: انظر إلى مقعدك من النار قد أبدلك الله به مقعدا في الجنة. قال النبي: فيراهما جميعا. وأما الكافر. أو المنافق . فيقول : لاأدري، كنت أقول ما يقول الناس. فيقال : لا دريت ولا تليت، ثم يضرب بمطرقة من حديد ضربة بين أذنيه، فيصيح صيحة يسمعها من يليه إلاّ الثقلين))

ప్రవక్త ﷺ ఇలా తెలిపారని, అనస్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారుః **"ఒక వ్యక్తి సమాధిలో పెట్టబడిన తర్వాత అతని సంబంధీకులు తిరిగి వెళ్తుండగా వారి పాదరక్షక శబ్దాన్ని అతడు వింటుంటాడు. అప్పుడు**

ఇద్దరు దూతలు వచ్చి అతన్ని కూర్చోబెట్టి ఇలా అడుగుతారు. 'ముహమ్మద్ (ﷺ) పట్ల నీవు ఏమనేవానివి?' అతడు (విశ్వాసుడైతే ఇలా) అంటాడుః 'ఆయన అల్లాహ్ దాసుడు, అల్లాహ్ ప్రవక్త'. 'ఇదిగో చూడు నరకంలో నీ స్థలం, (నీవు విశ్వాసునివి గనుక) అల్లాహ్ దానికి బదులుగా స్వర్గంలో ఈ స్థలం నీకు నొసంగాడు' అని అతనికి (స్వర్గం, నరకం రెండూ చూపబడుతాయి). "అతడు ఆ రెండిటినీ చూస్తాడని" ప్రవక్త ﷺ తెలిపారు. అదే అవిశ్వాసి లేక మునాఫిఖ్ (వంచకుడు) అయి ఉంటే (దూతలు అడిగినదానికి) 'నాకు తెలియదు. ప్రజలు అన్నదే నేననేవాణ్ణి' అని అంటాడు. అప్పుడు 'నీవు తెలుసుకోలేదు, (ఖుర్ఆన్) పఠించలేదు' అని ఇనుప గదములతో అతని రెండు చెవుల మధ్య ఒక పెట్టు పెడితే దాన్ని భరించలేక అరుస్తాడు. అతని కేకను ఇరుజాతులు (మానవులు, జిన్నాతులు) తప్ప సమీపములో ఉన్న వారందరు వింటారు". (బుఖారి).

## స్వర్గంలో లేక నరకంలో తన స్థలం గురించి మృతునికి శుభవార్త ఇవ్వబడుతుందిః

عن عبد الله بن عمرو رضي الله عنه أن رسول الله ﷺ قال: ((إن أحدكم إذا مات عرِض عليه مقعدُه بالغداة والعشيّ، إن كان من أهل الجنة فمن أهل الجنة، وإن كان من أهل النار فمن أهل النار، يقال له: هذا مقعدك حتى يبعثك الله إليه يوم القيامة))

ప్రవక్త ﷺ సెలవిచ్చారని, అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ ఉల్లేఖించారుః "**మీలో ఎవరైనా చనిపోయినప్పుడు అతడు స్వర్గవాసి అయితే స్వర్గం, నరకవాసి అయితే నరకం పొద్దుమాపు అతని సమక్షంలో ఉంచబడుతుంది. ప్రళయంనాడు అల్లాహ్ నిన్ను లేపే వరకు ఇదిగో నీ స్థలం" అని అనబడుతుంది.** (ముస్లిం).

**విశేషాలుః**

1- సమాధిలో దైవదూతలు మృతుణ్ణి ప్రశ్నిస్తారన్న విషయం (పై హదీసు ద్వారా) రుజువవుతున్నది.

2- సమాధిలో శిక్ష లేక వరాలు నొసంగబడుతాయి అని రుజువవుతున్నది.

3- ప్రళయానికి ముందే మృతుడు నరకం లేక స్వర్గంలో ఉన్న తన నివాసాన్ని చూసుకుంటాడు.